క్లుప్తంగా

మార్కండేయ ఆలయానికి వంటసామగ్రి బహూకరణ



వంటసామగ్రి అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: పట్టణంలోని భక్త మార్కండేయ స్వామి దేవాలయానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి రూ.1.5 లక్షల విలువైన వంటసామగ్రిని బహూకరించారు. దేవాలయంలో గోలి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి వంటసామగ్రిని అందించారు. శ్రీనివాస్‌రెడ్డి దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు బాలకృష్ణయ్య, కార్యదర్శి శివలింగం, కోశాధికారి సత్యరాములు, యువజన సంఘం అధ్యక్షుడు మామిడిశెట్టి రవి, మహిళా సంఘం అధ్యక్షురాలు అప్పం అలివేలు, నాయకులు చెర్కురవి, శ్రీను, నర్సింహ, జగదీశ్వర్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ఆలయాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ సహకారం అందిస్తుందని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరం క్షేత్రంలోని త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను శనివారం రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోన శ్రీనునాయక్, మాజీ సర్పంచ్ శ్రీరాములు, ఎంపీటీసీ సరిత పంతునాయక్, మాజీ ఎంపీటీసీ పంతునాయక్, ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తిరుమలేశ్వరుని గుట్టపై బోరు పనులు ప్రారంభం



బోరు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ సుకన్య, ఎంపీటీసీ లక్ష్మమ్మ

యాచారం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం యాచారం మండల కేంద్రంలోని శ్రీ తిరుమలనాథ దేవాలయం (తిరుమలేశునిగుట్ట)పై చింతపట్ల ఎంపీటీసీ సభ్యురాలు (బీజేపీ) తాండ్ర లక్ష్మమ్మ రూ.లక్ష సొంత డబ్బుతో బోరు వేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పు సుకన్య, యాచారం గ్రామ సర్పంచ్ ముదిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ లలిత, దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్లు ఈవీఎస్‌రెడ్డి, సత్తమ్మ, వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యులు జయమ్మ, సంజీవ, వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు. తాండ్రలక్ష్మమ్మను ఘనంగా సత్కరించారు.

22 నుంచి నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

కడ్తాల్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గ్రామాల్లో ఈనెల 22 నుంచి 28 వరకు మేకలు, గొర్రెల్లో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి భానునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 22న ముద్విన్, చల్లంపల్లి, రావిచేడ్, కడ్తాల్‌లో నులిపురుగుల నివారణ కార్యక్రమం ప్రారంభమవుతుందని.. జీవాల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మూడు నాలుకలు.. మూడు దవడలు

వింత దూడ జననం

యాచారం: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం ఓ ఆవు వింత దూడకు జన్మనిచ్చింది. రైతు ఐలయ్యకు చెందిన ఆవుకు పుట్టిన దూడకు.. మూడు నాలుకలు, మూడు దవడలు ఉన్నాయి. దూడను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున వచ్చారు.



ఇబ్రహీంపట్నం రూరల్: పూజలో ఆదిబట్ల వైస్ చైర్‌పర్సన్ కళమ్మ, భక్తులు



తలకొండపల్లి: వేడుకలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి



ఆమనగల్లు: శివపార్వతుల కల్యాణోత్సవంలో భక్తులు

ఘనంగా మహాశివరాత్రి

మహాశివరాత్రి ఉత్సవాలను ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రజలు సాయంత్రానికి ఉపవాస దీక్షలు విరమించారు. శివలింగాలకు అభిషేకాలు, బిల్వార్చన నిర్వహించారు. ప్రముఖులు పాల్గొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మార్కెట్‌లో పూలు, పండ్లకు డిమాండ్ కన్పించింది. – సాక్షి, నెట్‌వర్క్



కడ్తాల్: శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ఇబ్రహీంపట్నం: నాగలింగేశ్వర దేవాలయంలో..



కడ్తాల్: పూజలు చేస్తున్న మహిళలు



తలకొండపల్లి: రాంపూర్ శివాలయంలో..



మంచాల: ఆరుట్లలోని శివాలయంలో..



యాచారం: నందీశ్వరాలయంలో భక్తజనసందోహం

డబుల్ రోడ్లుగా గ్రామీణ రహదారులు

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: మారుమూల గ్రామాలను పంచాయతీలుగా చేసి వాటి అభివృద్ధికి నిధులు కేటాయించిన ఘనత సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన కుమారుడు, బీఆర్‌ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్ర శుక్రవారం రాత్రి ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లిలో జరిగింది. ఇంటింటికీ తిరిగి బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం రాత్రి గ్రామంలో జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత క్యామ మల్లేశ్‌లు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో రూ.500 కోట్లతో గ్రామీణ రోడ్లను డబుల్‌రోడ్లుగా మారుస్తున్నామన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. ప్రశాంత్‌కుమార్‌రెడ్డికి దేవుడి ఆశీస్సులు ఉండాలని.. అంచలంచెలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, ఎంపీపీ కృపేష్, సర్పంచ్‌లు రాంరెడ్డి, అండాలు, ఎంపీటీసీ మంగ రవీందర్, టీఆర్‌ఎస్ అధ్యక్షుడు బుగ్గరాములు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ డైరెక్టర్

పోల్కంపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ గునుకుల మల్లేశ్ బీజేపీని వీడి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పార్టీ కాలువ కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు.

సమస్యలు పరిష్కరించండి..

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారం జీవీఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ ఔట్‌లెట్, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రామ్మోహన్, కౌన్సిలర్ పరశురాం, మాజీ కౌన్సిలర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవ్వా.. పెన్షన్ వస్తుందా?



వృద్ధురాలిని పెన్షన్ గురించి అడుగుతున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: సంక్షేమ పథకాలు అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని బీఆర్‌ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రగతి నివేదన పాదయాత్ర శనివారం నాగన్‌పల్లిలో కొనసాగింది. ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నాగన్‌పల్లి డబుల్‌రోడ్డు నిర్మాణానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.24.55 కోట్లు ఖర్చు చేసిందన్నారు. గత ఎనిమిదేళ్లుగా గ్రామంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గ్రామంలో వృద్ధులను కలిసి పెన్షన్ వస్తుందా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బుగ్గరాములు, ఎంపీటీసీ మంగ రవీందర్, నాయకులు అంజయ్య, మల్లేష్, శరత్‌రాయుడు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహిస్తాం

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

తలకొండపల్లి: కనుమరుగవుతున్న ప్రాచీన కళలను, కళాకారులను ప్రోత్సహిస్తామని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చుక్కాపూర్‌లో త్వరలో యాదవ్వులు భ్రమరాంబ మల్లికారున స్వామి నాటకాన్ని ప్రదర్శించనున్నారు. ఈ మేరకు వారు నాటకానికి ఆర్థికసహాయం అందజేయాలని ఇటీవల ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డిని కలిసి కోరారు. వారి విజ్ఞప్తి మేరకు రాఘవేందర్‌రెడ్డి శనివారం మల్లప్పగుట్ట మల్లికార్జున స్వామి దేవాలయంలో కళాకారులకు రూ.35,000 అందజేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ స్వప్నా భాస్కర్‌రెడ్డి, పాండయ్య, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు

ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రయ్య

తుర్కయంజాల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులపై దాడి చేస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.చంద్రయ్య అన్నారు. ఏఐటీయూసీ ఆఫీస్ బేరర్స్ సమావేశం ఆదివారం తుర్కయంజాల్‌లో నిర్వహించగా చంద్రయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లేబర్ కోడ్‌లను ప్రభుత్వాలు అమలుపరచడం వలన కార్మికుల హక్కులను హరిస్తున్నాయన్నారు. వలస కార్మికుల శ్రమ దోపిడీ వలన తెలంగాణ కార్మికుల హక్కులు దెబ్బతింటున్నాయని, భవిష్యత్‌లో కార్మికుల సమస్యలపై సమగ్ర సర్వే చేసి జిల్లాలో ఉద్యమాలను రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ఓరుగంటి యాదయ్య, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు రామస్వామి, నాయకులు నర్సింహారెడ్డి, సత్యనారాయణ, చందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రయ్య

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

వ్యక్తి దుర్మరణం

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామం వద్ద హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆమనగల్లు ఎస్ఐ సుందరయ్య కథనం ప్రకారం వివరాలు.. హైదరాబాద్ నగరం వినయ్‌నగర్ కాలనీకి చెందిన మాణిక్‌రెడ్డి(60) శుక్రవారం ఉదయం బైక్‌పై నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి అర్ధరాత్రి తిరిగి వస్తుండగా విఠాయిపల్లి గ్రామ సమీపంలో వెనుకనుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కొడుకు అభిజీత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. మాణిక్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆమనగల్లులో శివాజీ శోభాయాత్ర

ఆమనగల్లు: పట్టణంలో శనివారం సాయంత్రం శివాజీ పరివార్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలో శోభాయాత్ర, కాగడాల ప్రదర్శన నిర్వహించారు. హనుమాన్ దేవాలయం నుంచి పట్టణంలోని అన్ని కాలనీల్లో శోభాయాత్ర, కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, శివాజీ పరివార్ వ్యవస్థాపక అధ్యక్షుడు నిరంజన్, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సహప్రముఖ్ శివాజీ, శివాజీ పరివార్ సభ్యులు పాల్గొన్నారు.



కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న శివాజీ అభిమానులు

రాక్షసగూళ్లు కనుమరుగు!

ఇనాంగూడలో పదేళ్ల క్రితం శిలాయుగపు సమాధుల గుర్తింపు

- పూర్తిస్థాయి పరిశీలన చేయడంలో పురావస్తు శాఖ అధికారుల తాత్సారం
- జాతీయ రహదారి విస్తరణలో ఆనవాళ్లు కోల్పోయే అవకాశం



ఇనాంగూడలో విజయవాడ జాతీయ రహదారి పక్కనే ఉన్న రాక్షసగూళ్లు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో మూడువేల సంవత్సరాల క్రితం నాటి పురాతన రాక్షసగూళ్లు (శిలాయుగపు) అధికారులు గుర్తించి ఏళ్లు గడుస్తున్నా వాటి రక్షణకు చర్యలు తీసుకోవడం లేదు. ప్రాచీనకాలం నాటి ఆనవాళ్లను రక్షించి వాటి చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉన్నప్పటికీ పురావస్తుశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో.. ఇటీవల ఎన్‌హెచ్ఏఐ వారు చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణలో అవి కనుమరుగు అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ గ్రామంలోని ఓ ప్రైవేట్ భూమిలో పదేళ్ల క్రితం మూడువేల ఏళ్ల నాటి శిలాయుగపు రాక్షసగూళ్లను పురావస్తుశాఖ అధికారులు గుర్తించారు. విజయవాడ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్నప్పటికీ అధికారులు గుర్తించేంత వరకు స్థానికులకు వాటి గురించి ఎలాంటి అవగాహన లేదు. అయితే పదేళ్ల క్రితం అధికారులు గుర్తించినప్పటి నుంచి కొంతమంది దుండగులు వాటిని తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వాటిల్లో గుప్తనిధులు ఉన్నాయన్న ఆశతోనే తవ్వకాలు చేపట్టేందుకు యత్నిస్తున్నట్లు స్థానికంగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయినప్పటికీ అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడంలేదు.

రోడ్డు విస్తరణతో పొంచి ఉన్న ముప్పు..

ఇటీవల విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభం కావడంతో మొన్నటి దాకా రోడ్డుకు దూరంగా ఉన్న సమాధులు.. విస్తరణ కారణంగా రోడ్డుకు దగ్గరగా రాగా మరికొన్ని కనుమరుగు అయ్యే అవకాశాలున్నాయి. విస్తరణలో వాటి ఆనవాళ్లు కోల్పోకముందే పురావస్తు శాఖ అధికారులు ఈ శిలాయుగపు రాక్షసగూళ్ల ఆనవాళ్లను మరోసారి పరీక్షించి భద్రపరచాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

రాతియుగం మనుషుల వస్తువులతో సమాధి..

రాక్షసగూళ్లుగా పిలువబడే వీటిని శిలాయుగపు మనుషుల సమాధులని పిలుస్తారు. అప్పటి మనుషులు రోగాలబారిన పడి ఒకేసారి మృత్యువాత పడితే వారితో పాటు వారు వినియోగించిన వస్తువులను కూడా ఈ సమాధిలోనే వేసి పూడ్చివేసేవారని అధికారులు తెలిపారు. కాగా వాటిని గుర్తుపట్టేందుకు వీలుగా సమాధులకు చుట్టూరా పెద్దరాళ్లను గుండ్రంగా వలయాకారంగా అమర్చుకునేవారని తెలుపగా ఇక్కడ ఉన్న సుమారు 3, 4 సమాధులు కూడా ఇలాంటి పోలికలతో ఉన్నాయి. పురావస్తు శాఖ అధికారులు పూర్తిస్థాయిలో ఈ సమాధులపై పరిశీలన చేస్తే చరిత్రకు అవసరమైన సమాచారంతో పాటు ఎన్నో అరుదైన వస్తువులు లభించే అవకాశాలున్నాయని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.